క్లుప్తంగా

ఘన నివాళి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి తనవంతుగా సహాయం అందించి అండగా ఉంటానని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తపేట్ శేఖర్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా అతని భౌతికకాయానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, నవీన్, వినయ్, శశికాంత్, పవన్, శ్రీకాంత్, లడ్డు పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన



జల్‌పల్లి గ్రామంలో గోడలపై వేసిన పెయింటింగ్

పహాడీషరీఫ్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్య అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. చెత్తను బహిరంగ ప్రదేశాలలో పడేయరాదని.. ఇంటింటికీ వచ్చే మున్సిపాలిటీ ఆటోలో తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాలలో వేసి అందించాలంటూ గోడలపై పెయింటింగ్‌లను వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని, స్వచ్ఛ జల్‌పల్లిలో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు.

తలసేమియా వ్యాధి.. చిన్నారికి ఆర్థికసాయం

ఉదారత చాటుకున్న మేయర్ పారిజాత దంపతులు



చిన్నారికి చెక్కును అందజేస్తున్న చిగురింత పారిజాత దంపతులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో గల సాయిబాలాజీ ఫేస్–2లో నివాసం ఉంటున్న నీలం శ్రీను సంధ్య కుమార్తె చిన్నారి శ్రీనిక తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.25 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. చిన్నారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కార్పొరేటర్‌కు పితృవియోగం



కార్పొరేటర్‌ను పరామర్శిస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి యాతం యాదయ్య(75) శుక్రవారం సాయంత్రం మామిడిపల్లిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత తదితరులు శనివారం యాదయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం పవన్ యాదవ్‌ను పరామర్శించి, మనోధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో టీఆర్‌ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, యూసుఫ్ పటేల్, సూర్దగంటి అర్జున్, సిల్వేరి సాంబశివ, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, బీజేపీ నాయకులు ఈరంకి వేణుగౌడ్, పెరమోని నరేష్ యాదవ్, రంగనాథ్, సయీం తదితరులున్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావును కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై అర్జున్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నుంచి ఉపాధ్యాయులను అక్రమంగా రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నా ఇక్కడి ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని విమర్శించారు. జిల్లాకు బదిలీల్లో ప్రాముఖ్యత ఇవ్వడం లేదని, అక్రమ బదిలీలను వెంటనే నిలిపివేసి, జిల్లా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విద్యాధికారిని కోరారు.ఇప్పటికే 100 మంది ఉపాధ్యాయులను ఇతర జిల్లాల నుంచి దొడ్డి దారిన జిల్లాకు మార్చారని, అక్రమ బదిలీలపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

బడంగ్‌పేట్‌లో అవిశ్వాస వేడి

చైర్‌పర్సన్ పీఠంపై బీఆర్‌ఎస్ కన్ను
- మద్దతిస్తామంటున్న బీజేపీ
- సమర్థంగా ఎదుర్కొంటామని 'చిగురింత' ధీమా



బడంగ్‌పేట కార్పొరేషన్ కార్యాలయ భవనం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అవిశ్వాస సెగలు చెలరేగాయి. మేయర్‌పై అనర్హత వేటుకు ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. కార్పొరేషన్‌గా అవతరించిన బడంగ్‌పేటను 32 డివిజన్లుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. బీజేపీ నుంచి 10 మంది, కాంగ్రెస్ తరపున ఏడుగురు, టీఆర్‌ఎస్ నుంచి 13 మంది, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. హంగ్ ఏర్పడటంతో స్థానిక మంత్రి సబితారెడ్డి చొరవ తీసుకొని కాంగ్రెస్ నుంచి గెలిచిన చిగురింత పారిజాతను టీఆర్‌ఎస్‌లో కలుపుకొని వారి మద్దతుతో మేయర్ సీటును టీఆర్‌ఎస్ తన ఖాతాలో వేసుకుంది. డిప్యూటీ మేయర్ పీఠాన్ని స్వతంత్ర అభ్యర్థి ఇబ్రాంశేఖర్‌కు కట్టబెట్టారు. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం అంశం తెర మీదకు వచ్చింది. టీఆర్‌ఎస్‌లో చేరి మేయర్ సీటును దక్కించుకున్న పారిజాత తిరిగి తన సొంతగూడు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 32 కార్పొరేటర్ల సీట్లు ఉన్న బడంగ్‌పేటలో అవిశ్వాసాన్ని ఎదుర్కోవాలంటే 22 సీట్లు అవసరం అని తెలుస్తోంది. 10 సీట్లు ఉన్న బీజేపీ అవిశ్వాసానికి రెడీ అయినట్లుగా తెలుస్తోంది. ముందుకు వచ్చిన పార్టీలకు తాము మద్దతు ఇస్తామని మేయర్ ఇచ్చిన, డిప్యూటీ మేయర్ ఇచ్చిన తాము సర్దుకుపోతామని బీజేపీ నాయకులు అంటున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కలిసిమెలిసి ఉంటున్నారు. ఎవరు అధికారపక్షం, ఎవరు ప్రతిపక్షమని బీజేపీ నాయకులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. బీఆర్‌ఎస్ తరపున ఉన్న 15 మంది కార్పొరేటర్లకు మద్దతుగా మరో ఏడుగురు కార్పొరేటర్ల ఓటింగ్ అవసరం కానుంది. ఈ ఏడుగురి ఎక్స్‌అఫీషియో ఓట్లతో ఎలాగైనా మేయర్ సీటును దక్కించుకునే అవకాశం మెండుగా ఉందని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుత మేయర్ విజయం సాధించాలంటే మరో 15 మందిని (బీజేపీ, బీఆర్‌ఎస్) అక్కున చేర్చుకొని మేయర్ సీటును దక్కించుకునే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది. అవిశ్వాసం పెట్టనున్న బీజేపీకి మాత్రం మేయర్, డిప్యూటీ మేయర్ ఏది ఇచ్చిన సంతోషంగా భావిస్తున్నట్లుగా ఉంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా వీగిపోయేలా చేసి తిరిగి తామే మేయర్‌గా కొనసాగడం ఖాయమని మేయర్ చిగురింత పారిజాత పేర్కొంటున్నారు. కాగా మేయర్ సీటును అధికార పార్టీ ఖాతాలోకి తీసుకువెళ్లడం తథ్యమని టీఆర్‌ఎస్ పార్టీ ఆలోచనలు చేస్తోంది. అవిశ్వాసం సెగతో బడంగ్‌పేట కార్పొరేషన్ వేడెక్కుతుంది.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఓ వరం లాంటిదని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన మల్లమ్మకు రూ.40 వేలు, శ్రీనివాస్‌కు రూ.15 వేలు, బైరాగిగూడకు చెందిన భవానికి రూ.25 వేల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కులను శనివారం కందుకూరులో లబ్ధిదారులకు అందజేశారు. కాగా గూడూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి కేటాయించిన రూ.10 లక్షల మంజూరు పత్రాన్ని సర్పంచ్ శ్రీలతశ్రీహరికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరి సంక్షేమం కోసం నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని తమవంతు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సర్పంచ్ ఈ.రాంచంద్రారెడ్డి, నాయకులు కాకి దశరథ, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, బలరాం, దేశం కృష్ణారెడ్డి, మోహన్, మహిపాల్‌రెడ్డి, రాఘవేందర్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

హరినాయక్ మృతిపై విచారణ జరపాలి

వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం డిమాండ్



వీఎంహోం ఎదుట ఆందోళనకు దిగిన విద్యార్థి హరినాయక్ బంధువులు

హుడాకాంప్లెక్స్: విద్యార్థి అనుమానాస్పద మృతిపై పూర్తి విచారణ జరపాలని వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ డిమాండ్ చేశారు. వీఎంహోంలో 10వ తరగతి చదువుతున్న అనాథ విద్యార్థి రాతులావత్ హరినాయక్ శనివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. నల్లగొండ జిల్లా ముదిగొండ గ్రామం మటిక తండాకు చెందిన హరినాయక్ తల్లిదండ్రులు గోపాల్, శాంతిలు పది సంవత్సరాల క్రితమే చనిపోయారు. సోదరుడు భాస్కర్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. హరినాయక్ మృతి చెందడంతో సోదరుడు, బంధువులు, హోం ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, హోంసెక్రటరీ అఖిలేష్‌రెడ్డి, హోం వైస్ ప్రిన్సిపాల్ ప్రభుదాస్‌లు కుటుంబ సభ్యులతో మాట్లాడి రూ.5 లక్షల పరిహారం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

న్యాయ విచారణ జరిపించాలి

వీఎంహోంలో సెక్యూరిటీ సిబ్బందిని పెంచడంతో పాటు పిల్లల మానసిక నిపుణులను నియమించాలని తాము పలుమార్లు కోరిన వీఎంహోం సిబ్బంది పట్టించుకోవడం లేదని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేష్, సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఎంహోం విద్యార్థి హరినాయక్ మృతిపై పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి ప్రాణం విలువ రూ.5 లక్షలా?: కార్పొరేటర్ శ్రీవాణి

అనాథ విద్యార్థి వసతి గృహంలో చనిపోతే కేవలం రూ.5 లక్షల ఇచ్చి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మండిపడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలపై లోతుగా విచారణ చేయకుండా ప్రభుత్వ అధికారులు డబ్బులతో బంధువులను వెళ్లగొట్టారని ఆమె ఆరోపించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకారం



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆర్యవైశ్యులు

రాజకీయంగా ఎదిగేందుకు బీఆర్‌ఎస్ కృషి
- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సహకరిస్తుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంత్రి శనివారం ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాసవి మాత ఆలయ నిర్మాణానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఒక ఎమ్మెల్సీ, రెండు కార్పొరేషన్ చైర్మన్ పదవులను వైశ్యులకు కేటాయించారని గుర్తు చేశారు. దీంతో పాటు ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ ప్రాంతంలో 5 ఎకరాల స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని పేద వైశ్య కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు మంత్రిని గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా రాజకీయ కమిటీ ప్రధాన కార్యదర్శి తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా, బాలాపూర్ మండల అధ్యక్షుడు నాళ్ల శ్రీనివాస్‌గుప్తా, మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి మున్సిపాలిటీల అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్తా, తోర్పునూరి శ్రీనివాస్‌గుప్తా, ఆకుల చంద్రప్రకాశ్‌గుప్తా, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక..

సంఘం జిల్లా రాజకీయ కమిటీ ప్రధాన కార్యదర్శి తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో మండలానికి చెందిన ఆర్యవైశ్యులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అధిక పన్ను తగ్గించకపోతే ధర్నా చేస్తాం

డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మైత్రిపురం కాలనీవాసులతో సమావేశమైన నర్సింహారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో అధిక పన్ను, నల్లా బిల్లులను వెంటనే తగ్గించకపోతే పెద్ద ఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని మైత్రిపురం కాలనీలో అధిక పన్ను, నల్లా బిల్లుల విషయమై కాలనీ ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో కంటే అధికంగా వసూలు చేస్తున్న ఇంటి పన్ను, నల్లా బిల్లులతో మీర్‌పేట వాసులపై అధిక భారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ధర్నాకు కాలనీవాసులు పూర్తి మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కాలనీ అధ్యక్షుడు పి.జంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి వైఎస్ఆర్.మూర్తి, అశోక్‌కుమార్, నర్సింహారావు, శివలింగం, ఐతరాజు భాస్కర్, ఆల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయస్వామి ఆలయ పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో వైకుంఠరథం ప్రారంభం



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబిత

పహాడీషరీఫ్: ఆఖరి మజిలీ సజావుగా సాగేలా జల్‌పల్లి మున్సిపాలిటీ నిరుపేదలకు ఉచితంగా వైకుంఠ రథవాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి తెలిపారు. రూ.17 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన వైకుంఠ రథాన్ని చైర్మన్ అబ్దుల్లా సాదితో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బతికినన్ని రోజులు ఉరుకులు పరుగుల నడుమ గడిపిన మనిషి జీవితం చనిపోయినప్పుడు మాత్రం ప్రశాంతంగా అఖరి కార్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా వైకుంఠధామాలు నిర్మించారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ వాహనాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు మంత్రి అభివృద్ధి పనుల విషయమై మున్సిపాలిటీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ వసంత, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, బుడుమాల యాదగిరి, అహ్మద్ కసాది, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, యంజాల జనార్దన్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్



కందుకూరు: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సొడపు వెంకటేశ్‌గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి శనివారం మహేశ్వరంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మాజీ యూత్ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మైనార్టీ జనరల్ సెక్రటరీ ఎండీ అఫ్జల్‌బేగ్, మాజీ ఉప సర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు సురసాని రాంరెడ్డి, ఎడ్ల నర్సింహా, గాదె రామకృష్ణ, కందాడి శ్రీశైలం, ఎండీ ఖాజామోహినుద్దీన్, ఎస్.గణేశ్‌నాయక్, బుక్క పాండు రంగారెడ్డి, బొమ్మకూరు ప్రశాంత్‌కుమార్, ఎగ్గిడి జగదీశ్ ఎండీ సల్మాన్, ప్రశాంత్, అనిల్, ప్రభు, నయీమ్, రాజశేఖర్‌రెడ్డి, అయ్యప్ప, వినయ్‌చారి, రాజ్‌కుమార్, రవి, ఆజాద్, ఎస్.మహ్మద్, బురాన్, సురేశ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆమనగల్లు: వేరుశనగ పంటలో పచ్చపురుగు, లద్దె పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను శనివారం ఆమె పరిశీలించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయాధికారి వివరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



శంకరయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న నేతలు

మహేశ్వరం: మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామ పంచాయతీ సిబ్బంది తడకల శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. శనివారం వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డిలు పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్నవారిని అందెల శ్రీరాములు చారిట్రబుల్ ట్రస్టు ద్వారా ఆదుకొని వారికి అండగా ఉంటామన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుడు అకాల మరణం బాధకరమన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రావుల పర్వతాలు రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితం కావడంతో వారిని కూడా పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సిరిగిరిపురం సర్పంచ్ సురేష్, బీజేపీ సీనియర్ నాయకులు పాండు, శ్రావణ్, చెన్నయ్య, బాబయ్య, రాజేందర్,అనిల్, మహేందర్, నవీన్, పర్వతాలు పలువురు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకెళ్లాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా దండుమైలారం, రాయపోల్, ఇబ్రహీంపట్నంలోని బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పదో తరగతి తొలిమెట్టు లాంటిదన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునన్నారు. అందుకు కసితో చదవాలన్నారు. పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాగాకు సురేశ్, ఝాన్సీరాణి, సుచరిత పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోవాలి

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోయపల్లి, ఆరుట్ల గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులకు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాండాల జంగయ్యగౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కల్యాణ్ చక్రవర్తి, లోయపల్లి మాజీ సర్పంచ్ మోతీరాం నాయక్, ఎంఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



మన్సాన్‌పల్లిలో ఎంపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

మహేశ్వరం: క్రీడలు శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందిస్తాయని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో మన్సాన్‌పల్లి యూత్ ఆధ్వర్యంలో ఎంపీఎల్ (మన్సాన్‌పల్లి ప్రీమియర్ క్రికెట్ లీగ్) పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులకు కావాల్సిన డ్రెస్సులు, పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను డొనేట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన రన్నర్, విన్నర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను తాను సొంత నిధులతో బహుకరిస్తామన్నారు. గ్రామంలో మొత్తం 6 జట్లను ఎంపిక చేశారు.బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కంది రమేశ్, ఉపసర్పంచ్ నర్సింహాయాదవ్, నాయకులు పబ్బ ఆంజనేయులు గౌడ్, పాండు యాదవ్, కుమార్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.